విధులను నిర్లక్ష్యం చేస్తే సస్పెండ్ చేస్తా

- గురుకులాల్లో మెనూ తప్పకుండా పాటించాలి
- గండేడ్ పర్యటనలో కలెక్టర్ విజయేందిర బోయి



గండేడ్ బీసీ హాస్టల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి

గండేడ్: విధినిర్వహణలో అలసత్వం వహిస్తే కఠినంగా వ్యవహరించాల్సి వస్తుందని అవసరమైతే సస్పెండ్ చేస్తామని సల్కర్‌పేట్ మినీ గురుకులం ప్రిన్సిపాల్ రాగిణిపై కలెక్టర్ విజయేందిర బోయి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం కలెక్టర్ మండల కేంద్రంలోని బీసీ హాస్టల్, సల్కర్‌పేట్ మినీ గురుకులం, పగిడ్యాల్ అంగన్‌వాడీ, పల్లె దవాఖాన, ఆయుష్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సల్కర్‌పేట్ మినీ గురుకులంలో మధ్యాహ్న భోజనం పరిశీలించారు. పప్పు, చారు ఒకేలా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం భోజనం పెట్టడంలేదాని ప్రశ్నించారు. ఉదయం టిఫిన్ ఏం ఇచ్చారని ప్రిన్సిపాల్‌ను అడగగా టమాట రైస్ ఇచ్చినట్టు తెలిపారు. మెనూ ప్రకారం ఇడ్లి ఇవ్వాల్సి ఉండగా.. అదేందుకు ఇచ్చారని మండిపడ్డారు. ఇడ్లి రవ్వ అయిపోయిందని అందుకే టమాట రైస్ ఇచ్చినట్లు తెలిపారు. ఐదో తరగతి గదిలోకి వెళ్లి బోధన, పాఠశాలలో మౌలిక వసతులు, భోజనం వంటివాటికి సంబంధించిన విషయాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. రెగ్యులర్‌గా మినీ గురుకులాన్ని పర్యవేక్షించాలని ఎంపీడీఓ ఆదేశించారు. గండేడ్ బీసీహాస్టల్‌లో డార్మెటరీ, వంటగది, స్టోర్‌రూమ్‌ను పరిశీలించారు. అసంపూర్తి పనులు పూర్తి చేయడానికి ప్రతిపాదనలు పంపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పగిడ్యాల్‌లో పల్లెదవాఖాన, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈడీడీ, డీఓపీ నమోదును పరిశీలించారు. మాతా శిశు సంరక్షణపై అవగాహన కల్పించాలని సూచించారు. కలెక్టర్ వెంట ఎంపీడీఓ హరిశ్చంద్రారెడ్డి, ఎంఈఓ జనార్దన్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు జితేందర్ రెడ్డి, మిషన్ భగీరథ ఏఈ రామకృష్ణ, వార్డెన్ కృష్ణ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

మహేశ్‌కుమార్‌గౌడ్‌కు శుభాకాంక్షలు



దేవరకద్ర: టీపీసీసీ అధ్యక్షుడిగా మహేశ్‌కుమార్‌గౌడ్ పదవీ బాధ్యతలు స్వీకరించి మంగళవారం నాటికి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లోని మహేశ్‌కుమార్‌గౌడ్ నివాసానికి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డితోపాటు టీపీసీసీ అధికార ప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి వెళ్లి మహేశ్‌కుమార్‌గౌడ్‌ను శాలువాతో సత్కరించి పూలబొకేను అందజేశారు.

వైద్యశిబిరం విజయవంతం

మిడ్జిల్: మండలంలోని కొత్తూర్‌లో చేయూత రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం ఎస్‌వీఎస్ ఆస్పత్రి వైద్యబృందం సౌజన్యంతో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో 350 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు సరఫరా చేసినట్లు నిర్వాకులు తెలిపారు. కార్యక్రమంలో జడ్చర్ల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతిఅల్వాల్‌రెడ్డి, డాక్టర్లు శశాంక్, అరుణ్‌కుమార్, సాయికిరణ్, అనన్య, వసుధ, సాయిప్రసన్న, శిరీష, మార్థడేవిడ్, గ్రామపెద్దలు సత్యంగుప్తా, రాములు, కృష్ణయ్య, అభిలాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై కళాజాతా

నవాబుపేట: ఎయిడ్స్ వ్యాధిపట్ల ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా మంగళవారం కళాజాత కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో వెన్నెల కల్చరల్ అకాడమీ బృందం కళాజాత కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా మండల కేంద్రంతోపాటు యన్మన్‌గండ్లలో అవగాహన కల్పించారు. ఎయిడ్స్‌కు మందులేదని నివారణ ఒక్కటే మార్గమని సూచిస్తూ పలు నాటకాలు, పాటలు పాడి అలరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మండల వైద్యాధికారి శ్రావణ్‌కుమార్, పంచాయతీ అధికారి నరేశ్, కళాజాత బృందం రవిశంకర్, నర్సింహ, చెన్నయ్య, వెంకటేశ్, సిబ్బంది లక్ష్మి, అనిత, పద్మ తదితరులు ఉన్నారు.

సర్కిల్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్నిక ఏకగ్రీవం



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): విద్యుత్ ఉద్యోగుల 1104 సర్కిల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా విజయ్‌కుమార్ ముదిరాజ్ ఎన్నికయ్యారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన యూనియన్ సర్కిల్ సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సంఘం అభివృద్ధితోపాటు కార్మికుల సంక్షేమానికి తనవంతు కృషిచేస్తానన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిబాబ, జిల్లా నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

జాతీయస్థాయిలో రాణించాలి



మహబూబ్‌నగర్ క్రీడలు: నల్గొండలో ఈనెల 14న జరిగిన రాష్ట్రస్థాయి యోగాసన పోటీల్లో 35–45 ఏళ్ల విభాగంలో ప్రతిభచాటి మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించిన జిల్లా కేంద్రానికి చెందిన సీనియర్ కరాటే మాస్టర్ వెంకటేశ్‌ను మంగళవారం ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్‌పీ వెంకటేశ్ అభినందించారు. యోగాసనలో జాతీయ స్థాయిలో రాణించాలని ఆయన ఆకాంక్షించారు.

మున్సిపల్ భవన నిర్మాణ పనుల పరిశీలన

జడ్చర్ల: బాదేపల్లిలో కొత్తగా నిర్మిస్తున్న మున్సిపల్ కార్యాలయ భవనాన్ని మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, వైస్ చైర్‌పర్సన్ సారిక తదితరులు పరిశీలించారు. భవన నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి, ఈఈ విజయభాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్లు చైతన్య, ప్రశాంత్ రెడ్డి, రమేశ్, సతీశ్, లత, రాజు, రాఘురాంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉల్లిపాయల వేలం

దేవరకద్ర: దేవరకద్ర మార్కెట్ యార్డులో బుధవారం ఉల్లిపాయల వేలం నిర్వహించనున్నారు. వారానికి ఒకసారి ఉల్లి వేలంతో మార్కెట్‌లో వ్యాపారం సాగుతున్నది. ప్రస్తుతం సీజన్ లేకపోవడంతో మార్కెట్‌లో ఎలాంటి లావాదేవీలు సాగడంలేదు. బుధవారం ఒక్కరోజే ఉల్లివేలంతో వ్యాపారం సాగుతున్నది. ప్రస్తుతం ఉల్లి సీజన్ కూడా లేకపోవడంతో పాత ఉల్లిని రైతులు మార్కెట్‌కు అమ్మకానికి తెస్తున్నారు. ఉల్లి వేలం ఉదయం 10గంటల నుంచి వేలం ప్రారంభంకానుంది.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

గండేడ్: మండల కేంద్రంలోని బీసీ హాస్టల్‌లో విద్యార్థులకు మంగళవా రం వైద్యపరీక్షలు నిర్వహించారు. పగిడ్యాల్ డాక్టర్ ఆరిఫ్ ఆధ్వర్యంలో హాస్టల్‌లో వైద్యశిబిరం నిర్వహించారు. విద్యార్థులను పరీక్షించి సమస్యలకు తగ్గట్లు మందులు పంపిణీ చేశారు. అలాగే అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో సూచించారు. స్వచ్ఛమైన నీటిని తాగడంతోపాటు పౌష్టికాహారం తీసుకోవాలని వివరించారు. వైద్యశిబిరంలో సీహెచ్ఓ గోపాల్‌రెడ్డి, సూపర్‌వైజర్లు యాదమ్మ, పుష్పవేణి, హెల్త్ అసిస్టెంట్ గోపాల్, వార్డెన్ కృష్ణ ఉన్నారు.

నగరాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తాం



అంబేద్కర్ నగర్‌లో మల్టీపర్పస్ షెడ్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. స్థానిక అంబేద్కర్ నగర్‌లోని రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద రూ.పది లక్షలతో నిర్మించే మల్టీపర్పస్ షెడ్ పనులకు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి కాలనీలో రోడ్లు, యూజీడీ ఏర్పాటుతోపాటు మహిళా సంఘాల సభ్యులకు భవనాలు నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వినోద్‌కుమార్, సిరాజ్ ఖాద్రీ, బుద్దారం సుధాకర్‌రెడ్డి, శాంతన్నయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే సమీక్ష

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఈ ఏడాదిన్నరలో నగరం పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో మంగళవారం మున్సిపల్ కార్పొరేషన్ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షించారు. ఇప్పటివరకు 946 పనులు మంజూరైతే 668 పూర్తయినట్లు సమాధానమిచ్చారు. ప్రస్తుతం రూ.ఆరు కోట్ల విలువచేసే 61 పనులు కొనసాగుతున్నాయని, ఇంకా 217 పనులు ప్రారంభించలేదన్నారు. కాంట్రాక్టర్లకు రూ.కోట్లలో బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. దీంతో వారు కొత్త పనులు చేపట్టేందుకు ముందుకు రావడం లేదన్నారు. కాగా, వీరికి బిల్లుల చెల్లింపు విషయాన్ని త్వరలోనే ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. సమావేశంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఇన్‌చార్జ్ ఎంఈ నర్సింహ, డీఈఈ హేమలత, ఏఈలు వసంత, రాగవినతి, నుస్రత్ పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని బాలికల జూనియర్ కళాశాల వద్ద ముడా నిధులతో నిర్మించనున్న మరుగుదొడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో డీఐఈఓ కౌసర్‌జహాన్ పాల్గొన్నారు.

విద్యాప్రమాణాల పెంపునకు కృషి చేయాలి



ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందజేస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల: విద్యా ప్రమాణాల పెంపునకు ఉపాధ్యాయులు కృషిచేయాలని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ప్రైవేట్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన జేఆర్‌ఎస్‌ఎంఏ అవార్డుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ప్రైవేట్ ఉపాధ్యాయులకు అవార్డులు అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాలయాల్లో విద్యార్థులకు చక్కటి బోధనను అందించి వారిని ఉన్నతస్థాయిలో రాణించే విధంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ జ్యోతి, ఎంఈఓ మంజులాదేవి తదితరులు పాల్గొన్నారు.

దేవి నవరాత్రి ఉత్సవాల కరపత్రం విడుదల

నవాబుపేట: మండలంలోని పర్వతాపూర్ మైసమ్మ ఆలయంలో విజయదశమి సందర్భంగా నిర్వహించే దేవీశరన్నవరాత్రి ఉత్సవాల కరపత్రాన్ని ఆలయ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి, ఈఓ నర్సింహులు ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి చేతులమీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా పదిరోజులపాటు జరిగే ఉత్సవాలకు హాజరు కావాలని ఎమ్మెల్యేను ఆహ్వానించారు. కార్యక్రమంలో నర్సింహులు, గోపాల్, మల్లేశ్, బాలయ్య, వెంకటయ్య, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

రిషి పాఠశాలలో హిందీ దివాస్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని రిషి పాఠశాలలో మంగళవారం హిందీ దివాస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు విద్యార్థులకు ఆటపాటలు, సాంస్కృతిక, క్విజ్, వ్యాసరచన, పద్య రచన, ప్రసంగం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ పూజితమోహన్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతోపాటు అన్ని అంశాలపై పూర్తిస్థాయిలో అవగాహన ఉండాలని, అప్పుడు పూర్తిస్థాయి నైపుణ్యాలను పెంపొందించుకునే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్స్ కిరణ్‌కుమార్, మాలతి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.




ఉత్సాహభరితంగా ఎస్‌జీఎఫ్ క్రీడలు



మూసాపేటలో కబడ్డీ ఆడుతున్న అండర్-14 జట్లు

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన మండలస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు ఆకట్టుకున్నాయి. అండర్-14, 17 బాలబాలికల విభాగంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలను నిర్వహించారు. మూసాపేట, వేముల, నిజాలాపూర్, జానంపేట, పోల్కంపల్లి, మూసాపేట కేజీబీవీ, జానంపేట విశ్వభారతి హైస్కూల్‌కు చెందిన బాలబాలికలు పోటీల్లో పాల్గొన్నారు. అండర్-14 బాలుర కబడ్డీలో మూసాపేట, నిజాలాపూర్, ఖోఖోలో జానంపేట, మూసాపేట, వాలీబాల్‌లో మూసాపేట, జానంపేట జట్లు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. అండర్-14 బాలికల కబడ్డీలో పోల్కంపల్లి, మూసాపేట, ఖోఖోలో జానంపేట, మూసాపేట కేజీబీవీ జట్లు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. అండర్-17 బాలుర కబడ్డీలో మూసాపేట, నిజాలాపూర్, ఖోఖోలో మూసాపేట, జానంపేట, వాలీబాల్‌లో మూసాపేట, జానంపేట విశ్వభారతి జట్లు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. అండర్-17 బాలికల కబడ్డీ పోటీల్లో కేజీబీవీ మూసాపేట, మూసాపేట హైస్కూల్, ఖోఖోలో జానంపేట, మూసాపేట జట్లు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. పోటీలను ఎంఈఓ రాజేశ్వర్‌రెడ్డి పర్యవేక్షించారు. విద్యార్థులు చదువులతోపాటు క్రీడల్లోనూ రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు సుగుణ, శశికళ, జ్యోతి, జాహెదా, మేరీపుష్ప తదితరులు పాల్గొన్నారు.

తెల్లవార్లు పడిగాపులు



దేవరకద్ర మన గ్రోమోర్ వద్ద సోమవారం రాత్రి కొందరు రైతులు నిద్రిస్తుండగా మరికొందరి పడిగాపులు

దేవరకద్ర: యూరియా కోసం రైతులు సోమవారం రాత్రినుంచే పడిగాపులు కాశారు. 11వ తేదీ గురువారం ఇచ్చిన టోకెన్లకు మంగళవారం ఉదయం నుంచి మన గ్రోమోర్ కేంద్రం వద్ద యూరియా పంపిణీ ఉంటుందని అధికారులు ప్రకటించారు. దీంతో టోకెన్లు ఉన్న రైతులు సోమవారం రాత్రి దేవరకద్ర మన గ్రోమోర్ కేంద్రం వద్దకు చేరుకున్నారు. కొందరు అక్కడే నిద్రించగా మరికొందరు పడిగాపులు కాస్తు కనిపించారు. దేవరకద్ర పీఏసీఎస్ వద్ద ఈనెల 11వ తేదీ గురువారం జారీ చేసిన టోకెన్లకు మంగళవారం ఉదయం నుంచి మన గ్రోమోర్ కేంద్రం వద్ద యూరియాను పంపిణీ చేశారు. తెల్లవారకముందే బారులు తీరిన రైతులకు ఉదయం 8గంటల నుంచి యూరియాను పంపిణీ చేశారు. టోకెన్లు ఉన్న రైతులందరికీ యూరియాను అందజేసిన తర్వాత మన గ్రోమోర్ కేంద్రం మూసివేయగా.. యూరియా అవసరం ఉండి వచ్చిన రైతులు నిరాశతో వెనుదిరిగారు. కొందరు రైతులు టోకెన్లు ఇస్తారని పీఏసీఎస్ వద్ద వేచి చూశారు.



భూత్పూర్‌లో రైతులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ

జాతీయ రహదారిపై రైతుల ధర్నా

భూత్పూర్: మండలంలోని వివిధ గ్రామాల రైతులు మంగళవారం మరోసారి రోడ్డెక్కారు. భూత్పూర్ చౌరస్తాలో దాదాపు గంటపాటు మహిళా రైతులు సైతం రహదారిని స్తంభింపజేశారు. మండలంలోని రైతులకు 18వేల యూరియా బస్తాలు అవసరం ఉండగా.. దాదాపు 20వేలకు పైగా బస్తాలను సరఫరా చేసినట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. మండలంలో సరిపడిన దానికంటే ఎక్కువగానే యూరియాను అందించినా రైతులు ఎందుకు వస్తున్నారరో అర్థంకావడం లేదని అధికారులకు అంతుపట్టడంలేదు. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ చంద్రశేఖర్, పోలీసు సిబ్బంది రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసిన రాస్తారోకోను కొనసాగించారు. మరోసారి ఎస్‌ఐ ప్రయాణికులకు దూరపాంత్రాలకు వెళ్లేవారు, అత్యవసర పరిస్థితి కారణంగా వెళ్లేవారికి ఇబ్బంది పెట్టరాదని మరోసారి రైతులు నచ్చజెప్పడంతో రాస్తారోకోను విరమింపచేశారు.

మన గ్రోమోర్ వద్ద రైతుల తోపులాట

చిన్నచింతకుంట: యూరియా కోసం రైతులు తెల్లవారుజాము నుంచే కేంద్రాల వద్దకు తరలివచ్చి చెప్పులు క్యూలైన్లో ఉంచుతూ పడిగాపులు కాస్తున్నారు. ఒక్క బస్తా కోసం తిండితిప్పలు మాని లైన్లో నిల్చుంటున్నారు. మంగళవార చిన్నచింతకుంట మండల కేంద్రంలోని మన గ్రోమోర్‌కు 300బస్తాల యూరియా రాగా.. ఉదయం 5గంటలకే రైతులు తరలివచ్చి యూరియా దొరికే పరిస్థితులు లేవని తోపులాడుకున్నారు. పోలీసులు నివారించినా వినకపోయే సరికి అధికారులు గ్రోమోర్ సెటర్ మూసివేసి వెళ్లిపోయారు. రైతులు వినకపోవడంతో కొంతసేపటికి వచ్చి యూరియాను పంపిణీ చేశారు.

మలుపు.. ప్రమాదాలకు పిలుపు



భూత్పూర్ : చౌరస్తా నుంచి నాగర్‌కర్నూల్ వైపు వెళ్లే దారిలో మలుపు ప్రమాద భరితంగా మారాయి. ప్రతి నిత్యం భూత్పూర్ మీదుగా శ్రీశైలానికి కర్ణాటక,మహారాష్ట్రతో పాటు తాండూర్, రాయిచూర్ నుంచి శ్రీశైలం మల్లికార్జున దర్శనానికి వాహనాలపై రాకపోకలు సాగిస్తుంటారు. ప్రతి నిత్యం ఉద్యోగస్తులు సైతం ఈ రహదారి నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. భూత్పూర్ పట్టణం సమీపంలో రెండు చోట్ల, కొత్త మొల్గర, చౌలతండా వద్ద రెండు చోట్ల మలుపులు ప్రమాద భరితంగా ఉన్నాయి. వర్షాకాలం కావడంతో మలుపుల వద్ద రోడ్డుకు ఇరువైపుల మొక్కలు పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కన్పించకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మలుపుల వద్ద సూచికల బోర్డు ఏర్పాటు చేయాలని, రోడ్డు ఇరువైపుల పెరిగిన చెట్లు తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు

భవిత సెంటర్ ఏర్పాటుకు స్థల పరిశీలన



గండేడ్: భవిత సెంటర్ ఏర్పాటుకు మంగళవారం అడిషన్ కలెక్టర్ శివేంద్రప్రతాప్, డీఈఓ ప్రవీణ్‌కుమార్, సీఎంఓ సుధాకర్‌రెడ్డి స్థలాన్ని పరిశీలించారు. మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో స్థలం అనుకూలంగా ఉందన్న సమాచారం మేరకు అధికారులు అక్కడికి చేరుకున్నారు. హెచ్ఎం తిరుపతమ్మతో అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ.. భవిత సెంటర్ ఏర్పాటుతో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ప్రశ్నించారు. సెంటర్ ఏర్పాటుకు ఎలాంటి ఇబ్బందుల్లేని హెచ్ఎం బదులిచ్చారు. అనంతరం పాఠశాల పరిసరాలను అదనపు కలెక్టర్ పరిశీలించి భవిత కేంద్రం ఏర్పాటుతో పిల్లలకు మేలు చేకూరుతుందని చెప్పారు. అందుకు సంబంధించి ప్రక్రియను చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం డీఈఓ ప్రవీణ్‌కుమార్ విద్యార్థులతో మాట్లాడారు. విద్యాబోధన, మధ్యాహ్న భోజనం ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాల సాధనకు శ్రమించాలని అందుకనుగుణంగా ఉపాధ్యాయులు విద్యాబోధన చేయాలని సూచించారు. అనంతరం బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించారు. కార్యక్రమంలో ఎంఈఓ జనార్దన్‌తోపాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రగతికి తోడ్పాటునందించాలి

గండేడ్: విద్యార్థుల ప్రగతికి ఉపాధ్యాయులు తోడ్పాటునందించాలని డీఈఓ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో మండలస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి మాట్లాడారు. అనంతరం మండలస్థాయిలో అత్యుత్తమ సేవలు అందించిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ జనార్దన్, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.